సాక్షి
వికారాబాద్
గురువారం ׀ 29 ׀ ఫిబ్రవరి ׀ 2024





**టమాటాకు 'గుండుసూది'**

టమాటా పంటకు గుండుసూది పురుగు ఆశించడంతో దిగుబడి దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. 8లో▸



**సోలార్ కంచె..**

పంటలను అడవి పందులు, పశువుల నుంచి కాపాడుకోవడానికి రైతులు పొలాల చుట్టూ సోలార్ కంచెను ఏర్పాటు చేస్తున్నారు. 8లో▸

**పోలీసుల జోక్యం ఉండదు**

పరిగి: భూ వివాదాల్లో పోలీసుల జోక్యం ఉండదని ఎస్పీ కోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోమ మండలం తిమ్మాయిపల్లి భూ సమస్యకు పోలీసులకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. కొంతమంది ప్రజా సంఘాల నాయకులు పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## న్యూస్‌రీల్

### ఎస్సీ వర్గీకరణతో సమన్యాయం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్



కమిటీ నూతన సభ్యులకు నియామక పత్రాన్ని అందజేస్తున్న మల్లికార్జున్

కొడంగల్ రూరల్: ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగ, ఉప కులాలకు సమన్యాయం జరుగుతుందని, ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కోడిగంటి మల్లికార్జున్ కోరారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమాన్ని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కొడంగల్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడుగా దోమ అశోక్, ఉపాధ్యక్షుడిగా టి.సిద్దు, అధికార ప్రతినిధిగా కె.నాగప్ప, ప్రధాన కార్యదర్శిగా కె.మధు, కార్యదర్శిగా టి.నరహరి, ప్రచార కార్యదర్శిగా శివకుమార్, కోశాధికారిగా ఎం.చందు, గౌరవ సలహాదారులుగా భీమప్ప, కార్యవర్గ సభ్యులుగా మరో నలుగురిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్కప్ప, అధికార ప్రతినిధి ప్రకాష్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాపై దుష్ప్రచారం తగదు

రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజుస్వామి



బంట్వారం: విద్యుత్ సరఫరాపై ప్రతిపక్ష పార్టీల దుష్ప్రచారం ఎంత మాత్రం తగదని ట్రాన్స్‌కో కాంట్రాక్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజుస్వామి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట మరమ్మతులు జరుగుతుంటాయని తెలిపారు. ఈ క్రమంలో ట్రాన్స్‌కో కాంట్రాక్టర్లు పనులు చేసే ప్రాంతంలోని సబ్ స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకొని విద్యుత్ సరఫరా ఆపడం సహజమేనని తెలిపారు. అంత మాత్రాన ప్రతిపక్ష పార్టీలు విద్యుత్ సరఫరాపై నిందలు వేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తప్పు పట్టడం సరికాదన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌కు శ్రీకారం చుట్టింది నాటి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అని గుర్తుచేశారు. ప్రస్తుతం తెలంగాణలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడం హర్షణీయమన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోవాలని హితవు పలికారు.



మోమిన్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు

# మొదటి రోజు పరీక్ష ప్రశాంతం

జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. అరగంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. వికారాబాద్ పట్టణంలో ముగ్గురు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో పరీక్షకు అనుమతించలేదు. కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

– వికారాబాద్ అర్బన్



పెద్దేముల్‌లో పరీక్షకు హాజరైన విద్యార్థులు

# ఖాళీలు 325



టీఆర్‌టీ కోసం శిక్షణ తీసుకుంటున్న నిరుద్యోగులు

## మెగా డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు

- గత నోటిఫికేషన్ కంటే జిల్లాలో 134 ఉపాధ్యాయ పోస్టులు అధికం

వికారాబాద్ అర్బన్: ఎన్నికల హామీని నిలబెట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ఒకటి రెండు రోజుల్లో మెగా డీఎస్సీ వేస్తున్నట్లు ప్రకటించడంతో అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో తాజాగా ఏర్పడిన ఉపాధ్యాయ ఖాళీల వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారులు ఉన్నతాధికారులకు పంపారు. గత ప్రభుత్వం డీఎస్సీ నిర్వాహణకు షెడ్యూల్ ప్రకటించినా ఎన్నికల కోడ్ కారణంగా పరీక్షలు నిర్వహించలేదు. పైగా గతంలో ప్రకటించిన ఉపాధ్యాయ పోస్టులు చాలా తక్కువగా ఉన్నాయని, జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో కనీసం 50శాతం కూడా భర్తీ చేయడం లేదని అప్పట్లో నిరుద్యోగులు ఆందోళనలు చేశారు. గత డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లాలో కేవలం 191 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్నట్లు ప్రకటించడం జరిగింది. ఈ విషయం నిరుద్యోగులను ఆందోళనకు గురిచేసింది. కొత్త ప్రభుత్వంలో వెలువడే నోటిఫికేషన్‌లో వికారాబాద్ జిల్లాలో 325 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**2017 తరువాత ఇప్పుడే..**

2017లో టీఆర్‌టీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం తిరిగి ఇప్పుడే పోస్టులను భర్తీ చేస్తోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండో సారి అధికారంలోకి వచ్చాక పెద్ద ఎత్తున ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తుందనే ఆశతో నిరుద్యోగులు ఎదురు చూశారు. కానీ వారి ఆశలు నెరవేరలేదు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటనతో ఒక్కసారిగా నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఈ ఆరేళ్ల కాలంలో జిల్లాలో వేల మంది విద్యార్థులు డైట్, బీఎడ్ పూర్తి చేసి టెట్ క్వాలిఫై అయి డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్నారు.

**జిల్లాలో పెరిగిన పోస్టుల సంఖ్య**

317 జీవో అమలు సమయంలో జిల్లా ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల వివరాలను సేకరించారు. జీవో అమలు పూర్తయ్యాక ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం మరోమారు విద్యాశాఖ అధికారులు ఖాళీల లెక్కలను తీశారు. దీంతో జిల్లాలో అన్ని సబ్జెక్టులు కలిపి 325 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇదే విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. అయితే జిల్లాలో ఖాళీగా ఉన్న మొత్తం పోస్టులు ఈ డీఎస్సీలో భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇదే జరిగితే చాలా కాలంగా ఎదురు చూస్తున్న టీఆర్‌టీ నిరుద్యోగులకు ఎంతో మేలు జరగనుంది.

**లాంగ్వేజ్ గ్రేడ్ –2 పోస్టులు ఇవే..**

- లాంగ్వేజ్ పండిత్ హిందీలో గవర్నమెంట్ ఒకటి, లోకల్ బాడీ 10
- సంస్కృతంలో గవర్నమెంట్ స్కూల్‌లో ఒకటి పోస్టు ఉంది.
- తెలుగు గవర్నమెంట్ 1, లోకల్ బాడీలో 7 పోస్టులు ఉన్నాయి.

| ప్రస్తుతం జిల్లాలో భర్తీ చేసే పోస్టుల సంఖ్య | | |
|---|---|---|
| స్కూల్ అసిస్టెంట్ | - | 93 |
| ఎస్‌జీటీ | - | 195 |
| లాంగ్వేజ్ పండిత్ (ఎస్‌ఏ) | - | 9 |
| లాంగ్వేజ్ పండిత్ గ్రేడ్ -2 | - | 23 |
| పీఈటీ | - | 5 |

- ఉర్దూలో గవర్నమెంట్ 1, లోకల్ బాడీలో 2 పోస్టులు ఉన్నాయి.
- పీఈటీ తెలుగు మీడియంలో లోకల్ బాడీలో 5 పోస్టులు ఉన్నాయి.

**స్కూల్ అసిసెంట్ పోస్టులు**

- స్కూల్ అసిస్టెంట్ పోస్టుల వివరాలకు వస్తే బయోలాజికల్ సైన్స్ లోకల్ బాడీలో 21
- ఇంగ్లిష్ సబ్జెక్టు, గవర్నమెంట్‌లో 1, లోకల్ బాడీలో 22 పోస్టులు ఉన్నాయి.
- హిందీ సబ్జెక్టు లోకల్ బాడీలో 3 పోస్టులు ఉన్నాయి.
- మ్యాథ్స్ (తెలుగు మీడియం) గవర్నమెంట్‌లో 1, లోకల్ బాడీలో 8, మ్యాథ్స్ (ఉర్దూ మీడియం)లో గవర్నమెంట్ 1, లోకల్‌బాడీ కింద 2 పోస్టులు ఉన్నాయి.
- ఫిజిక్స్ (ఇంగ్లిష్ మీడియం) లోకల్ బాడీ కింద 3, ఫిజిక్స్ (తెలుగు మీడియం) లోకల్ బాడీ కింద 4, ఫిజిక్స్ (ఉర్దూ మీడియం)లో గవర్నమెంట్ 1, లోకల్ బాడీలో 1 పోస్టు ఉంది.
- సోషల్ (తెలుగు మీడియం) లోకల్ బాడీలో 23, ఉర్దూ మీడియం లోకల్ బాడీ కింద 2 పోస్టులు ఉన్నాయి.
- ఎస్‌ఏ తెలుగు గవర్నమెంట్ 1, లోకల్ బాడీలో 6
- ఎస్‌ఏ ఉర్దూ లోకల్ బాడీలో 2 పోస్టులు ఉన్నాయి.
- ఎస్‌జీటీ తెలుగు మీడియంలో గవర్నమెంట్ 6, లోకల్ బాడీలో 163 పోస్టులు ఉన్నాయి.
- ఎస్‌జీటీ ఉర్దూ మీడియంలో గవర్నమెంట్ 9, లోకల్ బాడీలో 17 పోస్టులు ఉన్నాయి.



కొడంగల్ మండలంలో గుంతలమయంగా మారిన గ్రామీణ రోడ్డు(ఫైల్)

# రహదారులకు లైన్ క్లియర్

- పంచాయతీ రాజ్ రోడ్లకు రూ.213 కోట్లు మంజూరు
- త్వరలో పనులు ప్రారంభం

| | |
|---|---|
| కొడంగల్ మండలానికి : రూ.39 కోట్లు | |
| దౌల్తాబాద్ మండలానికి : రూ.46 కోట్లు | |
| బొంరాస్‌పేట మండలానికి : రూ.39 కోట్లు | |
| కోస్గి మండలానికి : రూ.37 కోట్లు | |
| మద్దూరు మండలానికి : రూ.52 కోట్లు | |

కొడంగల్: నియోజకవర్గంలోని ఉమ్మడి ఐదు మండలాల్లో పంచాయతీ రాజ్ రోడ్లకు ప్రభుత్వం రూ.213.20 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ప రిపాలనా అనుమతులు ఇచ్చారు. కొడంగల్, దౌ ల్తాబాద్, బొంరాస్‌పేట, కోస్గి, మద్దూరు మండలా ల్లో మొత్తం 30 రోడ్లకు మోక్షం లభించింది. ఎన్నో ఏళ్ల తర్వాత గ్రామీణ రహదారులకు మరమ్మతులు చేసే అవకాశం లభించింది. గ్రామాలకు రవాణా వ్యవస్థ మెరుగు పడుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నారు.

**అధ్వానంగా గ్రామీణ రోడ్లు**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు వికారాబాద్ జిల్లా పరిధిలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. దశాబ్ద కాలంగా మరమ్మతులకు నోచుకోలేదు. అడుగుకో గుంత ఉండటంతో వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొంది. గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రావడం లేదని, ప్రైవేటు వాహనాలే దిక్కయ్యాయని విద్యార్థులు వాపోతున్నారు.

**కొడంగల్ మండలంలో..**

మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. మండలంలో పెద్ద గ్రామ పంచాయతీగా పేరుగాంచిన రుద్రారం దారి అధ్వానంగా ఉంది. ఈ మార్గంలో చిట్లపల్లి, అంగడిరాయిచూర్, టేకుల్‌కోడ్, అన్నారం, నాగారం, పాటిమీదిపల్లి గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. పెద్ద నందిగామ గ్రామం నుంచి హస్నాబాద్ వెళ్లే రోడ్డుపై, పెద్దనందిగామ నుంచి దుద్యాల వెళ్లేదారిలో గుంతలు ఏర్పడ్డాయి. రుద్రారం నుంచి బోనమ్మతండా, బోయపల్లి తండాల రోడ్డుదీ ఇదే పరిస్థితి. గ్రామీణ రోడ్లకు త్వరగా మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కొడంగల్ నుంచి బొంరాస్‌పేట మండలం గౌరారం, బాపల్లితండా వరకు వెళ్లే రోడ్డు పరిస్థితి అలాగే ఉంది. ఈ దారిలో నాస్కన్‌పల్లి, చిలుముల్ మైలారం, చెట్టుపల్లి తండా, బాపల్లితండా, గౌరారం గ్రామాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రోడ్ల మరమ్మతులకు భారీగా నిధులు మంజూరు కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# అన్యాక్రాంతం..!

## బడాబాబుల చేతుల్లోకి భూదాన్ భూములు

- అక్రమంగా ఫ్యాక్టరీ నిర్మాణం
- పరిశ్రమ ఆవరణలో బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ శాఖ
- పేదలకు పంచాలంటున్న నాయకులు



పరిశ్రమ ఆవరణలో ఇది భూదాన్ భూమి అని బోర్డు పాతిన రెవెన్యూ అధికారులు

పరిగి: గతంలో నిరుపేద దళితులకు పంచిన భూదా న్ భూములు అన్యాక్రాంతం అయ్యాయి. పేద రైతుల బతుకుదెరువు కోసం ఇచ్చిన భూములు ఇప్పుడు బడాబాబుల చేతుల్లోకి చేరాయి. భూదాన్ యజ్ఞ బోర్డు నిబంధన ప్రకారం దానంగా స్వీకరించిన భూములను విక్రయించరాదు, కొనరాదు. అయితే కొందరు అక్రమార్కులు ఆ భూములపై కన్నేసి దర్జాగా కబ్జాలు చేసి వ్యాపారాలు చేస్తున్నారు. అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో నామమాత్రపు డబ్బు ఇచ్చి భూములను కొనుగోలు చేసినట్లు తెలిసింది. అన్యాక్రాంతమైన భూములను తిరిగి పేదలకు ఇచ్చేలా చూడాలని గతంలో ప్రజా సంఘాల నాయకులు అధికారులను కోరారు. ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కానీ ఫలితం లేకుండా పోయింది. పరిగి మండలం నారాయణపూర్ రెవెన్యూ గ్రామం లక్ష్మీదేవిపల్లి పంచాయతీలో 33.09 ఎకరాల భూదాన్ భూమి అన్యాక్రాంతం అయ్యింది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లోని నిరుపేద దళిత రైతులకు భూదాన్ భూములను పంచింది. ప్రస్తుతం ఆ భూమిలో ఫ్యాక్టరీని నెలకొల్పినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. నారాయణపూర్ సర్వే నంబర్ 143లో 14.15 గుంటలు, 144లో 13.30 గుంటలు, 145లో 5.04 గుంటలు మొత్తం 33.09 ఎకరాల భూదాన్ భూమి ఉంది. 15 మంది రైతులకు ఒక్కొక్కరికి రెండు ఎకరాల చొప్పున అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈ భూములపై బడాబాబుల కన్ను పడింది. నాయకుల అండదండలతో ఆ భూములకు తప్పుడు ధ్రువీకరణ సృష్టించి ఆక్రమించారు. మరి కొన్ని భూములను నిరుపేద దళితులకు లేనిపోని మాటలు చెప్పి వారి నుంచి కొనుగోలు చేశారు. ఇప్పటికైనా భూదాన్ యజ్ఞ బోర్డు సభ్యులు, అధికారులు హైకోర్టుకు నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లోని భూదాన్ భూముల రికార్డులను సమర్పించి బాధిత రైతులకు న్యాయం చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే మరోసారి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

### బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ శాఖ

తమ భూములను తమకే ఇవ్వాలని నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి గ్రామాలకు చెందిన బాధిత రైతులు ప్రజాసంఘాల నాయకులతో కలసి పలుమార్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అప్పట్లో స్పందించిన రెవెన్యూ అధికారులు భూసర్వే చేసి పరిశ్రమ ఆవరణలో ఇది భూదాన్ భూమి అని బోర్డును పాతారు. దీంతో ఫ్యాక్టరీ యజమానులు కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. రెవెన్యూ అధికారులు భూదాన్ భూముల రికార్డులను కోర్టుకు సమర్పించకపోవడంతో ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదు. కొంతమంది నేతలు బడాబాబులకు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### పేదలకే దక్కాలి



పేదలకు ఇచ్చిన భూదాన్ భూములు బడాబాబుల చే తుల్లో ఉన్నాయి. న్యాయం చేయాలని సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నాం. తప్పుడు ధ్రువీకరణ పత్రా లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రస్తుతం ఆ భూమిలో పరిశ్రమ నెలకొల్పారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. లేకుంటే పేదల పక్షాన పోరాటం చేస్తాం.

– వెంకటయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు

### కోర్టు పరిధిలో ఉంది

భూదాన్ భూములు ఆక్రమించుకున్న వారికి గతంలో నోటీసులు ఇచ్చాం. ఫ్యాక్టరీ యజమాని కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. భూదాన్ బోర్డు వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి ఆదేశాలు అందేదాకా వేచి చూస్తాం.

– ఆనంద్‌రావు, తహసీల్దార్, పరిగి

# దండన.. కాదు బోధన

- స్కూళ్లలో బెత్తానికి పనిచెబుతున్న టీచర్లు
- ఇటీవల పరిగిలో ఉపాధ్యాయుడు కొట్టడంతో ఆస్పత్రి పాలైన విద్యార్థి
- తాజాగా వికారాబాద్‌లో విద్యార్థిని చితకబాదిన ప్రిన్సిపాల్
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- వెలుగుచూడని ఘటనలు ఎన్నో



వికారాబాద్ గురుకులంలో ఉపాధ్యాయుడు కొట్టడంతో గాయపడిన విద్యార్థి

వికారాబాద్: దండించడం బోధనా పద్ధతి కాదని చట్టాలు, చైల్డ్ సైకాలజిస్టులు, ఉపాధ్యాయ శిక్షకులు గొంతెత్తి అరుస్తున్నారు. బడుల్లో మాత్రం ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. క్రమశిక్షణ, హోంవర్క్, చదువు పేరుతో విద్యార్థులు భరించలేని పనిష్మెంట్లు అమలు చేస్తున్నారు. దీంతో అక్కడక్కడ విద్యార్థులు స్కూల్ మానేసిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మరికొన్ని చోట్ల ఆస్పత్రుల పాలవుతున్నారు. జిల్లాలో ఎక్కడో ఒకచోట ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. తాజాగా వికారాబాద్‌లోని ఓ గురుకుల పాఠశాలలో జరిగిన ఘటన మనస్తత్వ నిపుణులను నివ్వెరపోయేలా చేసింది. చివరకు విద్యార్థి తల్లిదండ్రులు ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయితే సంబంధిత టీచర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల పరిగిలో జరిగిన మరో ఘటనలో విద్యార్థి ఆస్పత్రి పాలై బడికి దూరమయ్యాడు.

**శిక్షణలో నేర్చుకున్నది ఒకటి..**

చాలా మంది ఉపాధ్యాయులు దండన.. బోధనా పద్ధతి కాదు అనే విషయాన్ని గుర్తించడం లేదు. కొడితేనే, శిక్షిస్తేనే, బెదిరిస్తేనే విద్యార్థులకు చదువు వస్తుందనే భ్రమలో ఉన్నారు. కొట్టకపోతే చదువెలా వస్తుంది..? వారి తల్లిదండ్రులే కొట్టమంటున్నారు.. అంటూ వింత వాదనలు చేస్తున్నారు. చైల్డ్ సైకాలజీ, బోధన పద్ధతులు అంతగా అభివృద్ధి చెందని కాలంలో పనిష్మెంట్ విధానం ఉండేదని మనం విన్నాం. కానీ కాలక్రమేణా పిల్లల మనస్తత్వ శాస్త్రంతో పాటు బోధనా పద్ధతులు ఎంతో అభివృద్ధి చెందాయి. దండన బోధనా పద్ధతి కానేకాదు అనే సూత్రం బయటకు వచ్చింది. పిల్లలను కొట్టకుండా చదువు చెప్పే అనేక పద్ధతులను కనిపెట్టారు. ఉపాధ్యాయులకు డైట్, బీఈడీ, ఎంఈడీ లాంటి శిక్షణలోనూ ఇదే విషయం చెబుతున్నారు. మనస్తత్వ శాస్త్రవేత్తల తోపాటు మన చట్టాలు అదే విషయం స్పష్టం చేస్తున్నాయి. పిల్లలను లేత వయసులో దండించటం ద్వారా భవిష్యత్‌లో అనేక ఇబ్బందులకు గురవుతారని, కొట్టడం ద్వారానే ఏదైనా సాధ్యమవుతుంది.. ఏదైనా సాధించుకోవచ్చని వారి మనసులో నాటుకుపోతుందని, భయంతో వారు బడి మానేసే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. పిల్లలు ఎవరికి వారే ప్రత్యేకం.. ఒక్కొక్కరికి ఒక్కోలాంటి బోధనా పద్ధతి అవసరం. ఉపాధ్యాయులు ఈ విషయాన్ని పక్కన పెట్టి అందరికీ ఒకే తీరున బోధన చేస్తున్నారు. అది సక్సెస్ కాకపోవడంతో దండించడాన్ని ఎంచుకుంటున్నారని చైల్డ్ సైకాలజిస్టులు అంటున్నారు. శిక్షణలో శారీరక దండన తప్పు అని నేర్చుకొని విధుల్లో చేసిన టీచర్లు సైతం దండనను వీడటం లేదు.

### ఇటీవల జరిగిన ఘటనలు..

- వికారాబాద్‌లోని మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో జగ్గులో నీళ్లు తీసుకొని ఆడుతున్నాడనే కారణంతో8వ తరగతి విద్యార్థిని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ చితకబాదాడు. ఏకంగా ఐదు కర్రలు విరిగేదాకా కొట్టాడు. వీపు, చేయి, కాళ్లపై గాయాలయ్యేదాకా కొట్టాడు. అదే సమయంలో విద్యార్థి మేనమా మ రావడంతో అతని దాష్టీకం ఆగింది. లేదంటే ఇంకా కొట్టేవాడని వారు వాపోయారు.తీవ్ర గాయాలైన విద్యార్థిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు.
- రెండు నెలల క్రితం పరిగి నంబర్ వన్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. బొంరాస్‌పేట్ మండలం బురాన్‌పూర్‌కు చెందిన నిరుపేద మహిళ పరిగిలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తోంది. తనకు చదివించే స్తోమత లేకపోయినా కొడుకును పరిగి ఎస్సీ హాస్టల్‌లో ఉంచి నంబర్ వన్ ఉన్నత పాఠశాలలో చేర్పించింది. 8వ, తరగతి చదువుతున్న బాలుడిని రెండు నెలల క్రితం ఓ ఉపాధ్యాయులు కంఠం పట్టుకుని పైకి లేపాడు. దీంతో గొంతులోపల గాయమై మాటలు నిలిచిపోయాయి. స్థానిక ఆస్పత్రిలో చూపించినా ప్రయోజనం లేకపోవడంతో హైదరాబాద్‌లో చేర్పించారు. రెండు నెలలుగా బాధిత విద్యార్థి బడికి రావడం లేదు. ఈ ఘటన ఆ పేద విద్యార్థి డ్రాపౌట్‌కు కారణమయ్యింది. ఇలాంటి ఘటనలు నిత్యం ఎక్కడో ఓ చోట జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఉపాధ్యాయులు శారీరక దండన పద్ధతిని మాని నూతన విధానంలో పాఠ్యాంశాలు చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## క్లుప్తంగా

### ఇసుక తరలిస్తే కేసులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏఎస్‌ఐ పవన్‌కుమార్

**తాండూరు రూరల్:** అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని కరన్‌కోట్ పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ పవన్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని వీర్‌శెట్టిపల్లిలో ఆయన పర్యటించారు. వీర్‌శెట్టిపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని గ్రామస్తులను హెచ్చరించారు. తహసీల్దార్ నుంచి పర్మిషన్ తీసుకొని ఇసుక తరలించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగప్ప, కానిస్టేబుల్ ధన్‌రాజ్ ఉన్నారు.

### బెల్టుషాపుపై పోలీసుల దాడులు


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపిస్తున్న ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి

**కుల్కచర్ల:** బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కుల్కచర్ల ఎస్‌ఐ అన్వేష్ రెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన బరిసెట్టి గోపాల్ నిబంధనలకు విరుద్ధంగా మద్యం నిల్వఉంచడంతో పాటుగా విక్రయాలు కొనసాగిస్తున్నాడన్న సమాచారంతో బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో 12 బీర్లు, 48 సీసాల మద్యం లభించింది. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు గోపాల్‌పై కేసు నమోదు చేశారు.

### బీజేపీ ఐటీసెల్ జాయింట్ కన్వీనర్‌గా శ్రీకాంత్‌రెడ్డి



**అనంతగిరి:** తెలంగాణ బీజేపీ ఐటీసెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా నవాబ్‌పేటకు చెందిన పర్మటి శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఐటీసెల్ కన్వీనర్ ప్రకాష్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేందుకు గాను సోషల్ మీడియా వేదికగా ప్రచారం నిర్వహిస్తామన్నారు.

### చేపలవేటకు వెళ్లిన వ్యక్తి మృతి

**యాలాల:** చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చెన్నారంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. చెన్నారం గ్రామానికి చెందిన నర్సింహులు (48) సోమవారం గ్రామశివారులోని ఓబావి వద్ద చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడి నీటమునిగి మృతి చెందాడు. మృతదేహం మంగళవారం సాయంత్రం బావిలో తేలగా గమనించిన గ్రామస్తులు యాలాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు శవానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# టమాటాను గుచ్చేస్తున్న గుండుసూది!

- పంటను ఆశించి తీవ్ర నష్టం చేస్తున్న పురుగు
- వారం రోజుల్లోనే తుడిచిపెట్టుకుపోతున్న తోటలు
- సస్యరక్షణ చర్యలతోనే కట్టడి
- కృషి విజ్ఞాన కేంద్రం నిపుణుడు శ్రీకృష్ణ సలహాలు




పురుగు ఆశించి దెబ్బతిన్న టమాటా పంట

**కందుకూరు:** రైతులు సాగుచేస్తున్న టమాటా పంటలను ఆశిస్తున్న గుండుసూది పురుగు తీవ్ర నష్టం కలిగిస్తోంది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అధికంగా పండించే కూరగాయ పంట టమాటా. వర్షాకాలంలో 30- 40 వేల ఎకరాలు, యాసంగిలో 15 వేల ఎకరాలల్లో సాగవుతోంది. 2014 సంవత్సరం మార్చి, ఏప్రిల్ మాసాల్లో మొదటిసారిగా గుండు సూది(ట్యూటా అబ్సల్యూట) పురుగు టమాటాను ఆశించి నష్టపరిచింది. పంట ఆకులు, కాయలపై ఆశించి రంధ్రాలు చేసి తీవ్రంగా నష్టపర్చింది. అప్పటి నుంచి ఏటా ఫిబ్రవరి నుంచి మే నెలల మధ్య చాలా ప్రాంతాల్లో పురుగు విజృంభించినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆ పురుగు పాము పొడ పురుగు లాగే ఉండటంతో దానికి సంబంధించిన క్రిమిసంహారక మందులనే పిచికారీ చేసి ఫలితం లేక పంటలు కోల్పోతున్నారని కృషి విజ్ఞాన్ కేంద్రం క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ పేర్కొన్నారు. ఆ పురుగు జీవిత కాలం చాలా తక్కువ(7 రోజులు). అందుకే దీని నివారణ కూడా కష్టమవుతుంది. ఆ పురుగు నివారణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను గురించి ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

**నష్టపరిచే భాగాలు..**

ట్యూటా అబ్సల్యూట పురుగు సోలనేట్ కుటుంబానికి చెందిన టమాటా, వంగ, బంగాళదుంప, మిర్చి, క్యారెట్ వంటి పంటను అధికంగా ఆశించి నష్టపరుస్తుంది. ప్రస్తుతం టమాటాపై అధికంగా కనిపిస్తుంది. ఈ పురుగు లార్వా దశ మాత్రమే మొక్కపై ఆకులు, కాయల భాగాలను పాడు చేసస్తుంది. ఈ లార్వాలు పంట కాలం అన్ని దశల్లో ఆశిస్తాయి. నేలపై ఉండే మొక్క భాగాలపైన, లేత ఆకులు కాండాలు, మొగ్గలు, పచ్చికాయలపై రంధ్రాలు చేసి ఆశించడంతో కాయ కుళ్లి వాసన వస్తుంది. లార్వాలు ఆకులపై చేరి లోపలి భాగాలు తింటూ ఆకులు, కణాలు తెల్లబారి పోతాయి. చివరకు ఆకులు మొత్తం ఎండిపోతాయి. ఈ పురుగుతో తక్కువ సమయంలో ఎక్కువ పునరుత్పత్తి జరిగి అధిక సంఖ్యలో ఉండటంతో నష్టం భారీగా సంభవిస్తుంది. పురుగు లక్షణాలు గమనించిన వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి.

**నివారణ చర్యలు..**

ఈ పురుగు లార్వాలు ఆకుల లోపల ఉండటంతో రసాయన మందులతో నివారించడం చాలా కష్టం. సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడంతో మంచి ఫలితాలు ఉంటాయి.

- వేసవిలో లోతు దుక్కులు చేయటం.
- పంట చుట్టుపక్కల ఎత్తుగా పెరిగే జొన్న, మొక్కజొన్న, సజ్జ వంటి పంటను 2- 3 వరుసల్లో వేసుకుంటే పురుగు వ్యాప్తి కొంత తగ్గుతుంది.
- ఎక్కువగా పురుగు ఆశించిన మొక్కలను వెంటనే తీసీ వేసి పొలానికి దూరంగా కాల్చి వేయాలి.
- పొలం వెంబడి, గట్ల వెంబడి ఉమ్మెత్త మొక్కలు లేకుండా చేయాలి. లేకపోతే ఆ మొక్కలు పురుగులకు ఆతిథ్యం ఇస్తాయి.
- వీలైతే ప్లాస్టిక్ మల్చింగ్ పద్ధతిలో సాగు ద్వారా పంటను ఈ పురుగు నుంచి కొంత వరకు కాపాడవచ్చు.


టమాటా కాయలపై రంధ్రాలు చేస్తున్న పురుగు

**జీవ నియంత్రణ పద్ధతులు..**

- జీవ నియంత్రణ పద్ధతులైన బాసిల్లస్ తురింజిన్సీస్(బిటి) 1 గ్రా. లేదా 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా బెవెరియా బాసియాన(1 గ్రా. లీటర్ నీటికి) సాయంత్రం వేళల్లో పిచికారీ చేసి నివారించవచ్చు.

**లింగాకర్షక బుట్టలు..**

- మగ రెక్కల పురుగులను ఆకర్షించగలిగే లింగాకర్షక బుట్టలను(ఎరలు) భూమిలో ఒక అడుగు ఎత్తులో ఒక కట్టెకు అమర్చాలి. ఎక్కువ సంఖ్యలో ఎరలను అమర్చి మగ పురుగులను నియంత్రించడంతో పంట నష్టం తగ్గించవచ్చు.

**పసుపు జిగురు పేపర్..**

పొలంలో అక్కడక్కడా పసుపు జిగురు పేపర్‌ను ఉంచడం ద్వారా రెక్కల పురుగును నియంత్రించవచ్చు.

**రసాయన పద్ధతులు..**

ఈ పురుగుకు రసాయనాలకు త్వరగా తట్టుకునే శక్తి ఉంటుంది. ఎక్కువ సార్లు ఒకే రసాయనం వాడకుండా కింది వాటిని మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి. అవసరం మేరకు రసాయనాలు వాడాలి. సైపనోసాడ్ 0.4 మి.లీ, లేదా ఇండాక్సికార్బ్ 1 మి.లీ. లేదా డెల్టామెత్రిన్ 0.5 మి.లీ, లేదా కొరాజిన్ 0.5 మి.లీ మరియు వేపనూనె(1,500 పీపీఎం) 5 మి.లీ లీటరు నీటికి కలిపి పంటపై సాయంత్రం వేళల్లో పిచికారీ చేస్తే పురుగును సమర్థవంతంగా అరికట్టవచ్చును.

### మాజీ ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో పేకాట..

- ఎస్‌ఓటీ పోలీసుల దాడి
- పదిమంది జూదరుల అరెస్టు

**పరిగి:** ఓ మాజీ ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో పేకాట ఆడుతున్న పదిమందిని ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. పూడూరు మండల పరిధిలోని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఫాంహౌస్‌లో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో మంగళవారం అర్ధరాత్రి వికారాబాద్ జిల్లా ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు అబ్దుల్ బాసిద్(పూడూరు), నవాజ్‌రెడ్డి (సోమన్‌గుర్తి), రాజీవ్‌రెడ్డి (పెద్ద ఉమ్మెంతాల్), బోయిని రమేష్(ఇందూరు), అజీమొద్దీన్(చన్గోముల్), అన్వర్‌ఖాన్(మన్నేగుడ), అమీర్‌అలీ(కడుమూరు), అమరేందర్(చేవెళ్ల), విక్రమ్ అహ్మద్(పూడూరు), హకీం(మన్నేగుడ)ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.50,990 నగదుతో పాటు, మూడు కార్లు, మూడు బైక్‌లు, పది సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### పరీక్షకు వెళ్తుండగా..

**బైక్ అదుపు తప్పి విద్యార్థులకు గాయాలు**

**దోమ:** దిర్సంపల్లి గ్రామానికి చెందిన శివ అనే ఇంటర్ విద్యార్థితో పాటు మరో విద్యార్థి బుధవారం బైక్‌పై ఉదయం ఇంటి నుంచి పరీక్ష రాయడానికి కళాశాలకు బయల్దేరగా బొలేరోను తప్పించబోయి కింద పడిపోయారు. ఈ క్రమంలో శివ కాలు విరగగా, మరో విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని దోమ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాలువిరిగిన శివ పరీక్ష రాయలేకపోగా.. స్వల్ప గాయాలతో బయటపడిన మరో విద్యార్థి పరీక్ష రాసినట్లు తెలుస్తోంది.

## జిల్లావాసికి జర్నలిజంలో గోల్డ్‌మెడల్


గవర్నర్ చేతులమీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న వేణుగోపాల్ రావు

**వికారాబాద్ అర్బన్:** జిల్లా కేంద్రానికి చెందిన సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ చక్రవతి వేణుగోపాలరావు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ చేతుల మీదుగా పీజీలో కమ్యూనికేషన్ జర్నలిజంకు సంబంధించి బుధవారం గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ.. జర్నలిజం ద్వారా సమాజానికి చేయాల్సిన మేలును వివరించానన్నారు. ఈ సందర్భంగా ఆయనను కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయండి

**జిల్లా ఉప వైద్యాధికారి వినోద్‌కుమార్**


సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

**మీర్‌పేట:** మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి డా.వినోద్‌కుమార్ అన్నారు. మీర్‌పేటలోని బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి డా.బాలమణి ఆధ్వర్యంలో బుధవారం మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లు, జల్‌పల్లి మున్సిపాలిటీల అధికారులు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బందికి పల్స్‌పోలియో టీకాల పంపిణీపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. బాలాపూర్ వైద్యాధికారిణి బాలమణి మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మండల పరిధిలో మొత్తం 68 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయనున్నామని తెలిపారు. ఆరోజు వేయించని పిల్లల కోసం 4, 5 తేదీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు.

# అమలులోకి ఎన్నికల కోడ్

**కలెక్టర్ నారాయణరెడ్డి**


వికారాబాద్ అర్బన్: ఈవీఎం గోదాం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

**వికారాబాద్ అర్బన్:** జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఈవీఎంల గిడ్డంగి ఆవరణలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... మహబూబ్‌నగర్ శాసనమండలి ఎన్నికను పురస్కరించుకొని జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్పేట్, దౌల్తాబాద్, దుద్యాల్ మండలాలకు ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని తెలిపారు. మహబూబ్ నగర్ శాసనమండలి ఎన్నికకు సంబంధించి కొడంగల్ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కేంద్రంలో 55 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి, షెడ్యూల్ పత్రాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. అదేవిధంగా ఈవీఎంల మొదటి స్థాయి పరిశీలనపై ప్రతినిధులకు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ ఎం.సుధీర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**పనులను వేగవంతం చేయాలి**

ప్రభుత్వాస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశించారు. వికారాబాద్‌లో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు.

**నాణ్యతా ప్రమాణాలు పాటించాలి..**

జిల్లాలో సీసీరోడ్లకు సంబంధించి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు చేపట్టేలా పర్యవేక్షించాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం టెలికాన్ఫరెన్సు ద్వారా అధికారులతో ఆయన మాట్లాడారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులను మార్చి 15వ తేదీలోపు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. తెలిపారు. ఈ సందర్భంగా మండలాలవారీగా రోడ్ల నిర్మాణ పనుల పురోగతికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ పనుల్లో భాగంగా ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కోరారు. పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఉమేష్, శ్రీరాములు, డీఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**గోడలపై రాతలను తొలగించండి..**

**పెద్దేముల్:** రాష్ట్రంలోని వికారాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నగారా మోగింది. దీంతో జిల్లాలో బుధవారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో పెద్దేముల్ మండల కేంద్రంలో రాజకీయ పార్టీలు పెట్టిన బ్యానర్లు, పోస్టర్లను రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు తీసివేస్తున్నారు. గోడలపై రాతలను కూడా వెంటనే తొలగించాలని అధికారులు ఆదేశించారు.

## ప్రభుత్వాస్పత్రికి అంబులెన్స్

**అందజేసిన కేబీఎస్ బ్యాంక్ అధికారులు**

**కొడంగల్ రూరల్:** పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి బుధవారం కేబీఎస్ బ్యాంక్ సిబ్బంది అంబులెన్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. అత్యవసర సేవలకు అంబులెన్స్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రూ. 22 లక్షల విలువ చేసే అంబులెన్స్‌ను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కేబీఎస్ బ్యాంకు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు సీజీఎం సత్యనారాయణ, మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి, బ్యాంక్ అధికారులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


అంబులెన్స్‌ను బహూకరిస్తున్న బ్యాంక్ సిబ్బంది




వికారాబాద్ అర్బన్: పరీక్ష సెంటర్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి


కుల్కచర్ల: బందోబస్తును పరిశీలిస్తున్న డీఎస్పీ కరుణసాగర్ రెడ్డి


వికారాబాద్ అర్బన్: ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను నిలిపివేసిన అధికారులు


తాండూరు టౌన్: పరీక్ష గది నంబర్‌ను సరిచూసుకుంటున్న విద్యార్థులు

## మొదటి రోజు ప్రశాంతం

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు మొదటి రోజు(బుధవారం) ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 6,788 మంది జనరల్ విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 6,572 మంది హాజరయ్యారు. 216 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,398 మంది హాజరు కావాల్సి ఉండగా 1,308 మంది హాజరయ్యారు. 90 మంది గైర్హాజరయ్యారు. జనరల్ ఒకేషనల్ కలిపి 8,186 మంది హాజరు కావాల్సి ఉండగా 7,880 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పట్టణంలోని సిద్ధార్థ జూనియర్ కళాశాలలో పరీక్ష రాయాల్సిన ముగ్గురు విద్యార్థులు 5 నిమిషాలు ఆలస్యంగా సెంటర్‌కు రావడంతో వారిని అధికారులు లోపలికి అనుమతించలేదు. పరీక్ష కేంద్రాలను ఉన్నతాధికారులు పరిశీలించారు.

– సాక్షి, నెట్‌వర్క్


పెద్దేముల్: విద్యార్థులను చెక్ చేస్తున్న సిబ్బంది


పరిగి: పరీక్ష కేంద్రం వద్ద వేచిఉన్న విద్యార్థులు